నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కొండంగల్ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లో నేడు(బుధవారం) ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆప్తాల్మిక్ వైద్యులు హరినాథ్ నెహ్రూ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, వైద్య ఆరోగ్యశాఖ, కందూరి రాంరెడ్డి కంటి ఆసుపత్రి, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కంటి సమస్యలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు



మేడ్చల్‌లో క్రాకర్స్‌తో బీఆర్ఎస్ నేత మెరుగు మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు



బొమ్మల కొలువులో కుటుంబ సభ్యులతో నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి



ఇంట్లో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

జిగేల్.. జిగేల్!

దీపావళి.. ఆనందాల కేళి

ఇంటింటా విరజిమ్మిన దీపాల వెలుగులు

భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవి పూజలు, వ్రతాలు

బాణాసంచా పేల్చిన చిన్నాపెద్దలు

దీపావళి సంబురాలు సోమ, మంగళవారాల్లో అంబరాన్నంటాయి. వెలుగు జిలుగుల పండుగను పల్లె, పట్నం అనే తేడా లేకుండా ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తమ జీవితాల్లో కష్టాల చీకట్లు తొలగిపోయి సంతోషాల వెలుగులు నిండాలని వేడుకుంటూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం ప్రారంభాన్ని పురస్కరించుకొని రకరకాల పూలతో ఇళ్లను శోభాయమానంగా అలంకరించి నోములు, వ్రతాలు ఆచరించారు. సాయంత్రం వేళ ఇంటింటా దీపాలు వెలిగించి చిన్న, పెద్ద తేడా లేకుండా బాణాసంచా కాల్చారు. పండుగ సందర్భంగా ప్రతీ ఇంట్లో పిండి వంటలు ఘుమఘుమలాడాయి.

-ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, అక్టోబరు 21



పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, పోలీస్ అధికారులు

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

ఫ్లాగ్‌డే కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్

పోలీసు అమరవీరుల స్థూపం వద్ద ఘన నివాళి

వికారాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన అమర వీరుల సంస్మరణ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ, సమాజ రక్షణ కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన సైనికులు, పోలీసులను స్మరించుకోవడం మనందరి బాధ్యతని గుర్తు చేశారు. పౌర సమాజానికి పోలీసులు అందిస్తున్న సేవలు అత్యంత విలువైనవన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమర వీరుల ధైర్య సాహసాలు, దేశ భక్తి భావితరాలకు ఆదర్శమన్నారు. పరిపాలనలో పోలీసు వ్యవస్థ పాత్ర అత్యంత కీలకమని అన్నారు. అందుకే శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసు విభాగం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారని చెప్పారు.

ప్రజా సేవకు మహత్తర అవకాశం: ఎస్పీ

ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ, పోలీస్ ఉద్యోగం కేవలం విధి నిర్వహణ మాత్రమే కాదని, ప్రజలకు సేవ చేసే మహత్తర అవకాశమన్నారు. పోలీసు అమర వీరుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పోలీసు అమర వీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం నుంచి పటేల్ జయంతి 31వ తేదీ జాతీయ ఐక్యతా దినోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు, పోలీస్ అధికారులకు వ్యాస రచన పోటీలు, ఓపెన్ హౌస్, రక్తదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఇటీవల దేశవ్యాప్తంగా అమరులైన పోలీసులు, సైనికుల వివరాల పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించి ఏఎస్పీ రాములు నాయక్‌కు అందజేశారు. స్థూపం వద్ద కలెక్టర్, ఎస్పీ, అదనపు ఎస్పీ రాములు నాయక్, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమర వీరుల ఆత్మశాంతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, బాలకృష్ణారెడ్డి, జానయ్య, శ్రీనివాసులు, వీరేష్, ఆర్ఐ, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు కసరత్తు

జిల్లా వ్యాప్తంగా 129 కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ వానాకాలంలో జిల్లాలో 1.52 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, 3,84,800 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రావచ్చని అంచనా. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో 1.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్న లక్ష్యం నిర్దేశించుకున్నారు. ఇందుకు జిల్లా వ్యాప్తంగా 129 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 109 కేంద్రాల్లో దొడ్డు రకం, 20 కేంద్రాల్లో సన్నరకం ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నారు.

20 కేంద్రాల్లో సన్నరకం కొనుగోళ్లు

దొడ్డు రకం కొనుగోళ్లకు 109 సెంటర్లు

వచ్చేనెల రెండోవారం నుంచి విక్రయాలు

లక్ష్యం 3.84 లక్షల మెట్రిక్ టన్నులు

వికారాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా వ్యాప్తంగా నవంబర్ రెండో వారంలో వరి కోతలు ఊపందుకోనున్నాయి. అప్పటిలోగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే విధంగా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నవంబరు రెండు, మూడో వారం నుంచి ధాన్యం కొనుగోళ్ల ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. దొడ్డురకం ధాన్యం 76,400 మెట్రిక్ టన్నులు, సన్నాలు 38,600 మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. అలాగే గ్రేడ్ -ఏ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకం (గ్రేడ్-బీ) ధాన్యానికి రూ.2,369 చొప్పున ధర నిర్ణయించారు. కాగా, సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్‌గా చెల్లిస్తున్న విషయం తెలిసిందే.





28.75 లక్షల గన్నీ బ్యాగులు అవసరం

ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లాకు 28.75 లక్షల గన్నీ బస్తాలు అవసరం కాగా, ప్రస్తుతం 16.40 లక్షలు అందుబాటులో ఉన్నాయి. ఇంకా 15.12 లక్షల గన్నీ బ్యాగులు అవసరం కానున్నాయి. ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కాగానే బస్తాలు ముందుగానే సిద్ధం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం తూకం వేసేందుకు 334 తూకం యంత్రాలు, 263 తేమ శాతం గుర్తించే మీటర్లు అందుబాటులో

మిగతా 8వ పేజీలో...

పకడ్బందీగా ఏర్పాట్లు



జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా కొనసాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నాం. తూకం యంత్రాలు, తేమ కొలిచే మీటర్లు, టార్పాలిన్ షీట్లు, గన్నీ బస్తాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించాం. రైతులు ధాన్యంలో తాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తేమ లేకుండా బాగా ఆరబెట్టిన తర్వాతనే కేంద్రాలకు తీసుకు వస్తే ఎవరికీ ఇబ్బందులు ఎదురుకావు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

- లింగ్యానాయక్, అదనపు కలెక్టర్, వికారాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో

బషీరాబాద్ యువకుడి నామినేషన్



బషీరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బషీరాబాద్ మండలం నవాంద్గీ గ్రామానికి చెందిన ఎడ్ల సురేశ్ మంగళవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. మాల మహానాడు ప్రతినిధుల బృందంతో కలిసి నామినేషన్ వేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇకపై ప్రత్యక్ష ఎన్నికల్లో మాల మహానాడు అభ్యర్థులు పోటీలో ఉంటారన్నారు. ఈ ఉప ఎన్నికలో మాల మహానాడు అభ్యర్థి ఘన విజయం సాధించి చరిత్ర సృష్టించడం ఖాయమన్నారు.

మేడ్చల్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

మేడ్చల్ టౌన్ అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) పోలీసుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా మంగళవారం మేడ్చల్ పట్టణంలో పోలీసులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది పోలీస్టేషన్‌లో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి వివేకనందా చౌరస్తా వరకు కళాశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో భారీగా తహసీల్దార్ల బదిలీలు

14 మందికి స్థానచలనం



మేడ్చల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో జిల్లా రెవెన్యూ శాఖలో భారీగా బదిలీలయ్యాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న జిల్లా యంత్రాంగం ఆ దిశగా రెవెన్యూ శాఖలో బదిలీలు చేపట్టింది. జిల్లాలో కొందరు ఏళ్ల తరబడి ఒకేచోట తిష్టవేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ బదిలీ వేటు వేశారు. మొత్తం 14 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తే కలెక్టర్ మను చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే జూబ్లీహిల్స్ ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో డిప్యుటేషన్ పై బదిలీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. బదిలీ ఉత్తర్వులను ఉమ్మడిగా కాకుండా వ్యక్తిగతంగా ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

14 మంది బదిలీలు ఇలా..

శామీర్‌పేట తహసీల్దార్ పి.యాదగిరిరెడ్డిని కీసర తహసీల్దార్‌గా డిప్యుటేషన్ ఆధారంగా నియమించారు. శామీర్‌పేట డిప్యూటీ తహసీల్దార్ పి.సంయుక్తకు శామీర్‌పేట తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా ఘట్‌కేసర్ తహసీల్దార్‌గా కలెక్టరేట్‌లో డీ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన చంద్రశేఖర్‌ను, మేడిపల్లి తహసీల్దార్‌గా సీసీఎల్ఏ కార్యాలయం నుంచి కృష్ణచైతన్యను, మూడు చింతలపల్లి తహసీల్దార్‌గా సుచరిత, కీసర తహసీల్దార్‌గా పనిచేసిన యు.అశోక్‌ను కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. కలెక్టరేట్‌లో హెచ్ సెక్షన్‌లో పనిచేసిన బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని కాప్రా తహసీల్దార్‌గా బదిలీ చేశారు. కలెక్టరేట్‌లో సీ సెక్షన్ ఇన్‌చార్జిగా పనిచేసిన రాజేశ్వర్‌రెడ్డిని గండిమైసమ్మ మండల తహసీల్దార్‌గా బదిలీ చేశారు. బదిలీ అయిన అధికారులందరూ నేడు బాధ్యతలు తీసుకోనున్నట్లు సమాచారం.



కీసరగుట్టలో ఈ సారైనా..

7

భక్తులకు ఇబ్బందులు తప్పేనా?

వీఐపీ దర్శనాలతో భక్తుల ఆందోళన

ప్రతీ కార్తీక మాసంలోనూ ఇదే తీరు

నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు



గండి మైసమ్మ రోడ్డు పక్కన డంప్ చేసిన బండరాళ్లు

రోడ్డుపక్కనే గుట్టలుగుట్టలుగా..

ఇష్టారీతిన బండరాళ్ల డంపింగ్

ప్రమాదాలకు దారితీస్తున్న రాళ్లు.. ఇబ్బందుల్లో వాహనదారులు

మేడ్చల్ చెక్‌పోస్ట్ - గండి మైసమ్మ రోడ్డులో ఇష్టారాజ్యం

పట్టించుకోని సంబంధిత అధికారులు

మేడ్చల్ టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలను అరికట్టేలా రోడ్లను శుభ్రంగా ఉంచేందుకు ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు ఎంత కృషి చేస్తున్నా.. రోడ్డు పక్కన విచ్చలవిడిగా బండరాళ్లను డంప్ చేస్తూ యాక్సిడెంట్స్‌కు కారణమవుతున్నారు పలువురు వ్యాపారులు. ప్రధానంగా మేడ్చల్ చెక్‌పోస్ట్ - గండి మైసమ్మ రోడ్డు పరిసరాలు బండరాళ్ల డంపింగ్‌కు అడ్డాగా మారాయి. పెద్ద బండరాళ్లను మేడ్చల్ చెక్‌పోస్టు సమీపంలోని

మిగతా 8వ పేజీలో...

డంప్ చేసే వాహనాలు సీజ్ చేస్తాం



రోడ్డు పక్కన రాళ్ల డంపింగ్ చేసిన వాహనాలను సీజ్ చేస్తాం. రాత్రి వేళ కొందరు గుట్టుచప్పుడు కాకుండా రాళ్లను డంప్ చేసి వెళ్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఇతరులకు ఇబ్బంది కలిగించే వస్తువులు, వ్యర్థాలు డంప్ చేయటం నిబంధనలకు విరుద్ధం. అక్కడ వేసిన బండరాళ్లను తొలగించడంతో పాటు రాళ్లు డంప్ చేసిన వారి పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం

-చంద్రప్రకాశ్‌రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కమిషనర్

సదర్ సంబురం



యాదవులతో కలిసి నృత్యం చేస్తున్న వజ్రేశ్ యాదవ్

ఘట్‌కేసర్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ పండగను సోమవారం రాత్రి వైభవంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన భారీ దున్నపోతుల ప్రదర్శన నిర్వహించారు. ఈ విన్యాసాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం ఘట్‌కేసర్‌లో దున్నపోతుల ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవుల జీవనాధారమే పశుపోషణ అన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై యాదవ సంఘం సభ్యులతో కలిసి వజ్రేశ్ యాదవ్ నృత్యం చేసి అలరించారు.



ముస్తాబైన దున్నతో యాదవ సోదరుడు

పేదల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పేదల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆమనగల్లు మండలంలోని ఆకుతోటపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.వెయ్యి కోట్లతో కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా విశ్వాసం కోల్పోయిన బీఆర్ఎస్ కుట్ర రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసు అమర వీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంత రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు భట్టు కిషన్ రెడ్డి, సూదిని కొండల్‌రెడ్డి, బాస్కర్ రెడ్డి, యాట నర్సింహ, వెంకటేశ్, హన్మనాయక్, అంజన్‌రెడ్డి, గుర్రం కేశవులు,విజయ్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని సన్మానిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

మాడ్గుల మండలం అర్కపల్లి గ్రామానికి చెందిన దండు శేఖర్ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మంగళవారం ఆసుపత్రికి చేరుకొని శేఖర్‌ను పరామర్శించి రూ. 5వేలు ఆర్థికసాయం అందించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.



టెక్నికల్ క్లబ్ ప్రారంభోత్సవంలోఅధ్యాపకులు, విద్యార్థులు

అనురాగ్‌లో 'ఇన్నోవెక్స్' ప్రారంభం

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి పెంపొందించుకోవాలని, 'ఇన్నోవెక్స్' వంటి క్లబ్‌లు నూతన ఆవిష్కరణలకు వేదికలవుతాయని టాస్క్ ప్రతినిధి జి.శేఖర్‌రెడ్డి అన్నారు. వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం జరిగిన 'ఇన్నోవెక్స్' టెక్నికల్ క్లబ్ ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ సదస్సులతో పాటు కాలేజీల్లో ఏర్పాటు చేస్తున్న క్లబ్‌లలో భాగస్వాములు కావాలని, దీంతో సాంకేతిక నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్ బాబు, రమేష్‌బాబు, క్లబ్ అధ్యక్షుడు రవిరాజు, ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మి, కార్యదర్శి అన్నుమాలిని, సభ్యులు రిషిక, సౌమ్య, జయలక్ష్మి, సాయిశ్రీజ, పవన్, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

ఘట్‌కేసర్, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి):రైతులు తమ పశువులకు విధిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని ఘట్‌కేసర్ పశువైద్యాధికారి పద్మిని అన్నారు. మంగళవారం యంనంపేట్‌లో 160 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ.. పశువులకు గాలికుంటు వ్యాధి సోకితే పశువులు నీరసిస్తాయని, మేత మేయవని తెలిపారు. పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుందని, వ్యవసాయానికి వినియోగించే ఎడ్లు, దున్నలు సత్తువ కోల్పోతాయన్నారు. వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా టీకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



గేదెలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి పద్మిని

నిధుల్లేక.. పనులకు బ్రేక్

తుక్కుగూడలో అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం



- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు, పాలకవర్గ సభ్యులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, రైతులు

మహేశ్వరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో తుక్కుగూడలో చేపట్టిన సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. గత ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని రూ.4.5 కోట్లతో చేపట్టింది. ఆ నిధులు సరిపోకపోవడంతో అదనంగా రూ.5.66 కోట్లు విడుదల చేయాలని ప్రతిపాదనలు పంపించారు. దీంతో నిర్మాణ వ్యయం మొత్తం రూ10.16 కోట్లకు చేరింది. పనులు చేపట్టిన శ్రీకో ప్రాజెక్టు సంస్థ రూ.3.30 కోట్లతో పనులు ప్రారంభించగా ఆసంస్థకు రూ.50 లక్షలే విడుదలయ్యాయి. మిగిలిన రూ.2.80 కోట్లు విడుదల చేస్తేనే పనులు చేస్తామని సంస్థ పనులకు బ్రేక్ వేసింది. ఫలితంగా రైతులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

పనుల ప్రారంభమెప్పుడో!

హైదరాబాదుతోపాటు అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆనుకొని ఉన్న తుక్కుగూడలో భారీ పరిశ్రమలు, బహుళ అంతస్తుల నిర్మాణాలు, విలాసవంతమైన గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు, బావర్చీ, పిస్తాహౌస్, మస్కతి వంటి పెద్దపెద్ద హోటళ్లు ఇక్కడ వెలుస్తున్నాయి కానీ, ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకున్న మార్కెట్ యార్డు నిర్మాణ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ఇక్కడి వారాంతపు సంతలో కోట్ల వ్యాపారం జరుగుతుంది. సంతకు వచ్చే ప్రజలు, రైతులకు అందుబాటులో ఉండేలా సమీకృత మార్కెట్ యార్డు పనులను వెంటనే ప్రారంభించాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు. ఒక్క సంవత్సర కాలానికి వారంతపు సంత వేలంపాట రూ.2 కోట్ల వరకు పలికిందంటే ఈ మార్కెట్ యార్డు ఉపయోగం ప్రజలకు ఎంత అవసరమో తెలుస్తోంది.

నిధుల విడుదలకు కృషి చేస్తాం



తుక్కుగూడ మార్కెట్ యార్డు నిర్మాణానికి రావాల్సిన నిధులు సమయానికి రాకపోవడంతో పనులు ఆగిపోయాయి. నిలిచిపోయిన సమీకృత మార్కెట్‌యార్డు నిర్మాణాన్ని పునఃప్రారంభించి పూర్తి చేయాల్సి ఉంది. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. నిధులు విడుదలకు కృషి చేస్తాం. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభిస్తాం.

- వాణి, కమిషనర్, తుక్కుగూడ మున్సిపాలిటీ

మందుబాబులకు అడ్డాగా..

కూరగాయలు, మాంసం, చేపల విక్రయాలకు మార్కెట్ వసతి కల్పించేందుకు చేపట్టిన మార్కెట్ యార్డు నిర్మాణ పనులు ప్రారంభదశలో బాగానే జరిగినా తర్వాత నిధులు విడుదల కాకపోవడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. రెండు అంతస్తుల వరకు మార్కెట్ యార్డు పైకప్పు పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ రెండు సంవత్సరాలుగా పనులు చేయడం లేదు. గోల్కొండ కోటను తలపించేలా మార్కెట్ యార్డు నిర్మాణ పిల్లర్లు దర్శనిస్తున్నాయి. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు భవనం అడ్డాగా మారింది. రాత్రిపూట మందుబాబులు పార్టీలు చేసుకుంటున్నారు. తాగి పడేసిన మద్యం సీసాలు, ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ కవర్లతో మార్కెట్ యార్డు డపింగ్ యార్డులా తయారైంది. మున్సిపల్ పాలకవర్గం, ప్రత్యేకాధికారులు పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్యే అటువైపు కన్నెత్తికూడా చూడడం లేదేని స్థానికులు ఆరోపిస్తున్నారు.



నిధులు విడుదల చేయించాలి

బీఆర్ఎస్ హయాంలో సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఆ పనులు కూడా ప్రారంభించారు. ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆగిపోయిన పనులను కూడా ప్రారంభించడం లేదు. మార్కెట్ వసతి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆగిపోయిన మార్కెట్ యార్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలి.

- రవినాయక్, మాజీ కౌన్సిలర్

గురుకుల పాఠశాల నుంచి

పారిపోయిన ఇద్దరు విద్యార్థినులు

- గుర్తించిన పెట్రోలింగ్ పోలీసులు
- చైల్డ్‌లైన్ అధికారులకు అప్పగింత
- తల్లిదండ్రులకు సమాచారం
- ఘటనపై ఆరా తీసిన కలెక్టర్

వికారాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో ఉండడం ఇష్టం లేని ఇద్దరు విద్యార్థినులు గోడదూకి పారిపోయిన ఘటన వికారాబాద్‌లో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శివారెడ్డిపేట శివారులోని ఓ గురుకుల పాఠశాలలో చదువుతున్న ధారూరు, షాబాద్ మండలాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అక్కడ ఉండడం ఇష్టంలేక బయటకు పోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 19న రాత్రి స్టడీ అవర్ ముగిసే వరకు వారిద్దరూ చదువుకున్నారు. రాత్రి అందరూ నిద్రపోయాక సెక్యూరిటీ సిబ్బంది కళ్లుగప్పి గోడదూకి బయటకొచ్చారు. రాత్రి ఇద్దరు విద్యార్థినులు నడుచుకుంటూ వెళ్లడం చూసిన ఓ వ్యక్తి డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పెట్రోలింగ్ పోలీసులు వెంటనే స్పందించి గాలింపు చేపట్టి ఇద్దరు విద్యార్థినులను గుర్తించారు. అదే రాత్రి వారిని బాలరక్షా భవన్‌కు తరలించి చైల్డ్ లైన్ అధికారులకు అప్పగించారు. కాగా, పాఠశాలలో ఉదయం హాజరు తీసుకునే సమయంలో ఇద్దరు విద్యార్థినులు లేని విషయాన్ని గుర్తించారు. అయితే అప్పటికే ఇద్దరు విద్యార్థినులు బాలరక్షా భవన్‌లో ఉన్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో పాఠశాల ప్రిన్సిపాల్ అక్కడికి చేరుకుని ఆరా తీయగా, ఆ ఇద్దరూ తమ బాలికలేనని గుర్తించారు. ఈ విషయాన్ని విద్యార్థినుల తల్లిదండ్రులకు చేరవేశారు. సోమవారం వారొచ్చి బాలరక్షా భవన్ అధికారులను కలిసి తమ పిల్లలతో మాట్లాడారు. దీపావళి రోజు సెలవు ఉండడంతో విచారణ మంగళవారానికి వాయిదా వేశారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ వెంకటేష్ ఆ ఇద్దరు విద్యార్థినులతో, తల్లిదండ్రులతో వేర్వేరుగా మాట్లాడారు. విద్యార్థినుల గురించి ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో ఉండడం ఇష్టం లేదని విద్యార్థినులు చెప్పడంతో తల్లిదండ్రులకు అప్పగించారు. ఇదిలా ఉంటే, గురుకుల పాఠశాల నుంచి రాత్రి వేళలో ఇద్దరు విద్యార్థినులు బయటకు పారిపోయిన ఉదంతంపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. రాత్రి వేళలో విద్యార్థినులు బయటకు వెళితే విధుల్లో ఉన్న వారు ఏమి చేస్తున్నారని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

రోడ్ల విస్తరణతో మెరుగైన సౌకర్యాలు

● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రహదారుల విస్తరణతో గ్రామీణ ప్రాంతాల్లో సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంచాల మండల పరిధిలోని అస్మత్‌పూర్-మంచాలరోడ్డు బీటీ విస్తరణతోపాటు వివిధ గ్రామాలకు చెందిన లింకురోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరానికి చేరువలో ఉన్న మంచాల వెనుకబాటుకు గురైందన్నారు. ఇక్కడ ఉపాధి పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదిస్తానని చెప్పారు. ఇంకా గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి విడతలవారీగా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బోళ్ల జగన్, మంతని శివ, మార సురేష్, ప్రేమాకర్‌రెడ్డి, మంతని వెంకటేష్, లింగస్వామి, మంతని గణేష్, మంతని బాలు, మాదం సుందర్, గాలయ్య, పుట్ట మల్లేష్, పాండాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

ఏటీఎం చోరీ నిందితుడి అరెస్ట్

● వివరాలు వెల్లడించిన డీసీపీ సునీతారెడ్డి

ఆదిభట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ ఏటీఎం కేంద్రాల వద్ద డబ్బులు డ్రా చేయడం రాని వ్యక్తులు, సీనియర్ సీటిజన్లను టార్గెట్ చేసి ఏటీఎం నుంచి డబ్బులు దొంగిలించిన నిందితుడిని ఆదిభట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం పోలీసు స్టేషన్‌లో మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు, సీఐ రవికుమార్ వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా తాళ్లగడ్డకు చెందిన సుధనబోయిన వెంకటేష్(37), మేడ్చల్‌లోని కీసర ఇస్మాయిల్‌గూడలో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో నాలుగేళ్లుగా ఏంటీఎంల వద్ద దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఏటీఎంల వద్ద డబ్బులు డ్రా చేయరాని వ్యక్తులు, సీనియర్ సీటిజన్స్‌ను టార్గెట్ చేసుకొని వారికి డబ్బులు డ్రా చేయిస్తానని నమ్మించి వారి వద్ద ఒరిజినల్ ఏటీఎం కార్డు తీసుకొని దృష్టి మళ్లించి అతని వద్ద ఉన్న డూప్లికేట్ ఏటీఎం కార్డును మిషన్‌లో పెట్టి పిన్ నంబరు అడిగి ఆపరేట్ చేస్తాడు. తీరా డబ్బులు రావడం లేదని చెప్పి డూప్లికేట్ ఏటీఎం కార్డును వారికి ఇచ్చి ఒరిజినల్‌ను దొంగలిస్తాడు. ఆ కార్డుతో మరో చోట డబ్బులు డ్రా చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 11న తుర్కయాంజల్ పరిధిలోని ఎస్‌బీఐ వద్దకు డబ్బుల కోసం వచ్చిన ఓ వ్యక్తిని టార్గెట్ చేసి ఏటీఎంను దొంగిలించి రూ. 40 వేలు డ్రా చేసుకున్నాడు. బాధితుడు సాయినాథ్ మోహన్‌రావు 15న ఆదిభట్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఆదిభట్ల పోలీసులు యంజాల్ ఏటీఎం వద్ద నిఘా పెట్టారు. సోమవారం ఎస్‌బీఐ ఏటీఎం వద్ద అతడు కనిపించడంతో ఆదిభట్ల క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుని విచారించి అతని నుంచి రూ.6.31 లక్షల నగదు, సెల్ ఫోన్, బ్రిజా కారు. 23 ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఏటీఎం చోరీ కేసును ఛేదించిన క్రైమ్ ఎస్సై నోయెల్ రాజ్, రవికుమార్, కిరణ్ రెడ్డి, ఎల్లయ్య, ఉపేందర్ రెడ్డి, సందీప్, శివ చంద్ర, సంతోష్, పూజితను డీసీపీ, ఏసీపీ అభినందించారు.



మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

ఎస్బీఐ అదనపు బ్రాంచిని ఏర్పాటు చేయాలి

దోమ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు ఇబ్బందులు కలగకుండా మండలంలో ఎస్బీఐ అదనపు బ్రాంచిని ఏర్పాటు చేయాలని ఎస్బీఐ సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ నితిన్‌ను సర్పంచ్‌ల సంఘం దోమ మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి కోరారు. మంగళవారం దోమ బ్రాంచిని సందర్శించిన నితిన్‌ను ఆయన కలిసి ఖాతాదారుల ఇబ్బందులపై వివరించారు. మండలంలో ఒకే బ్రాంచి తో సర్వీస్ ఏరియా ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మేనేజర్ మాట్లాడుతూ.. మండలంలో 12సీఎస్‌పీ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని, నూతన బ్రాంచ్ ఏర్పాటనేది ఇక్కడ జరిగే లావాదేవీలపై ఆధారపడి ఉంటుందని తెలిపారు.



మేనేజర్‌కు విన్నవిస్తున్న రాజిరెడ్డి



నివాళులర్పిస్తున్న డీఎస్పీ, ఎస్సైలు

పోలీస్ అమర వీరులకు నివాళి

పరిగి,అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దేశ భద్రతకోసం ప్రాణాలర్పించిన వీర జవాన్‌లను గుర్తించుకోవాల్సిన అవసరం ఉందని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం సుల్తాన్‌పూర్ స్టేజి వద్ద ఉన్న బలిమెరలో అమరుడైన విజయ్‌భాస్కర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐ మాట్లాడుతూ.. వీరజవాన్‌ల సాంత్వన కల్గించేలా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మోహనకృష్ణ, ఏఎస్‌ఐ గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

సొమ్మసిల్లిన వ్యక్తి ఆచూకీ లభ్యం

కేశంపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వైరల్‌గా మారిన సొమ్మసిల్లి పడిపోయిన వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. మంగళవారం కేశంపేట మండలం సంతాపూర్‌లో శివారు నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి సొమ్మసిల్లి పడిపోయాడు. గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, గ్రామ యువకులు వ్యక్తి ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అలాగే 108లో కేశంపేట పీహెచ్‌సీకి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. ఈ పోస్టు వైరల్‌గా మారడంతో నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం సీతారామపురం గ్రామానికి చెందిన కాళ్ల బాలస్వామి(65)గా గుర్తించారు. ఎనిమిది నెలల కింద ఇంట్లో నుంచి వెళ్లిపోయాడాని కుటుంబ సభ్యులు తెలిపారు. బాలస్వామి సోదరుడు లోకేష్ తన అన్నను ఇంటికి తీసుకెళ్తామని తెలిపాడు. బాలస్వామి భార్య పదేళ్ల క్రితం మృతిచెందగా, వారికి ఇద్దరు కూతుళ్లు ఉండగా వారికి వివాహం అయ్యింది. ఓ కుమారుడు ఉండగా ఇంటర్ చదువుతున్నాడు.

ఎంపీ నిధులతో గ్రామాల అభివృద్ధి

పరిగి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నిధులతో గ్రామాల్లో సమస్యలు పరిష్కారం అవుతున్నాయని బీజేపీ బీసీసెల్ మండల అధ్యక్షుడు టీవీ నర్సింహులు అన్నారు. సయ్యద్‌పల్లిలో రూ.5లక్షల ఎంపీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఎంపీ నిధులతో సీసీ, డ్రైనేజీ పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, నాయకులు గణేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి



భవిత కేంద్రంలో సేవలను పరిశీలిస్తున్న ఎంఈవో గోపాల్

పరిగి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భవితే విద్యకు తొలిమెట్టని ఎంఈవో గోపాల్ అన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పరిగిలోని భవిత కేంద్రంలో కొనసాగుతున్న సేవలను పరిశీలించారు. కార్డులను పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న ఫిజియోథెరపీ, ప్రత్యేక విద్యాబోధన, క్రీడల నిర్వహణను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు ఫిజియోథెరపి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ శివప్రసాదరెడ్డి, ఐఈఆర్పీ జ్యోతి పాల్గొన్నారు.

తండాలో వీధిలైట్ల ఏర్పాటు

బషీరాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జమ్లానాయక్‌తండాలో వీధి లైట్ల సమస్య తీరింది. తండాలో వీధిలైట్లు లేక కొంత కాలంగా గిరిజనులు అంధకారంలో మగ్గుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి దశరథ్ దృష్టికి తీసుకెళ్లినా నిధులు లేక లైట్లు వేయించలేదు. ఈ క్రమంలో దీపావళి పండగకు వీధిలైట్లు వేయించాలని కార్యదర్శి తండానాయకుడు జయరాంరాథోడ్‌ను కోరారు. నిధులు వచ్చాక బిల్లు డబ్బులు ఇస్తామని తెలిపారు. దీంతో సోమవారం జయరాం, శంకర్ వీధి లైట్లు వేయించారు.

దేశ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకం



విద్యార్థినులకు నోట్‌బుక్స్‌ను అందజేస్తున్న రాజుగౌడ్

ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమని యువజన సంఘాల నాయకుడు పల్లె రాజు గౌడ్ అన్నారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని కోరారు. ఆమనగల్లు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం విద్యార్థినులకు నోట్‌బుక్కులు, వాటర్‌బాటిల్స్ పరీక్ష ప్యాడ్స్‌లను అందజేశారు. పేద విద్యార్థుల విద్యాభ్యున్నతికి ప్రతిఒక్కరూ తోడ్పాటునందించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి జీవితానికి బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సైదులు, సాయి, లోకేశ్, భరత్, మల్లేశ్, జహంగీర్, మున్నా తదితరులు ఉన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

షాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు పోరాడుతామని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అన్నారు. బీసీ రిజర్వేన్లపై హైకోర్టు స్టే విధించడంతో షాబాద్‌లో అంబేద్కర్ చౌరస్తా వద్ద బీసీ రిజర్వేన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్ష మంగళవారిని పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా బీసీలకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. రిలే నిరాహార దీక్షకు ఉద్యమకారుడు దేశమోళ్ల ఆంజనేయులు, బీఆర్‌ఎస్ నాయకులు నర్సింగ్‌రావు, రాజేందర్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు రవీందర్, చేవెళ్ల స్వామి, నర్సింహులు, రాము, రాజు, దర్శన్, నరహరిచారి, శ్రీనివాస్‌చారి, మధుసూదన్‌చారి, కరుణాకర్‌చారి, చంద్రయ్య, సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అంజనేయులు

విద్యతోనే ఉన్నత జీవితం

ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజంలో గౌరవం, ఉన్నత జీవితం లభిస్తుందని నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానుగుల దశరథం అన్నారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన నాయీబ్రాహ్మణ సేవా సంఘం నాయకుడు పెరికేటీ యాదయ్యసుజాత దంపతుల కూతురు సాయిదీపిక మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్‌కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో ఆమనగల్లులో అభినందన సభ నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షుడు గణేశ్, పట్టణ అధ్యక్షుడు రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి కానుగుల దశరథం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాయిదీపిక, ఆమె తల్లిదండ్రులు సుజాత యాదయ్యను సంఘం నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి గుద్దేటి బాలు, నాగేశ్, కోటి ఉన్నారు.



సాయిదీపికను సత్కరిస్తున్న కానుగుల దశరథం, నాయకులు

ఆలయ భూమిని హోల్డ్‌లో పెట్టండి

మాడ్గుల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత బ్రాహ్మణపల్లిలోని హనుమాన్ ఆలయం కింద గ్రామంలోని 215 సర్వే నంబర్‌లో 6.18 ఎకరాల భూమి ఉంది. ఏటా ఈ భూమిని కౌలుకు ఇచ్చేవారు. దాని మీద వచ్చే కౌలు డబ్బులను దేవాలయ ఖర్చులకు జమ చేస్తరని గ్రామస్తులు తెలిపారు. అయితే ఈ భూమిని గత ప్రభుత్వం నిషేధిత జాబితాల్లో చేర్చింది. గతంలో అప్పయ్య పేరుతో 12 ఎకరాల భూమి ఉంది. అందులోనుంచి దాదాపు ఆరెకరాలు అమ్మగా, మిగతా 6.15 ఎకరాలు ఆలయం ఆదీనంలో ఉంది. 2023లో ధరణిలో శ్రీనివాస్ అనే వ్యక్తి అక్రమంగా పట్టా చేయించుకున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంతేగాకుండా ఈ భూమిని ఇటీవల అమ్మే ప్రయత్నం చేశాడని చెప్పారు. ఈ మేరకు గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని సంబంధిత భూమిని హోల్డ్‌లో పెట్టాలని తహసీల్దార్ వినయసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సింగల్‌విండో డైరెక్టర్ రమేష్ గౌడ్, నారకట్ల వెంకటయ్య, జెల్ల వెంకటయ్య, కొండల్ పాల్గొన్నారు.



ఆలయ భూమిని కాపాడాలని తహసీల్దార్‌కు వినతి

కీసరగుట్టలో ఈ సారైనా..!



భక్తులకు ఇబ్బందులు తప్పేనా?

- స్థానికుల తీరుతో ఇక్కట్లు
- వీఐపీ దర్శనాలతో భక్తుల ఆందోళన
- ప్రతీ కార్తీకమాసంలోనూ ఇదే తీరు
- నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు
- నెల రోజుల పాటు విచ్చేయనున్న భక్తులు


కీసర, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతీ హిందువు పవిత్రంగా భావించే మాసం కార్తీకం. కార్తీకంలో శివుడికి పూజలు, అభిషేకాలు చేస్తే పుణ్యం అని భక్తుల నమ్మకం. ప్రముఖ కీసరగుట్ట రామలింగేశ్వరాలయానికి ప్రతీ కార్తీక మాసంలో ఉపావాస దీక్షలతో వచ్చే భక్తులకు సౌకర్యాలు లేక ఇక్కట్లు తప్పడం లేదు. ఎండోమెంట్ అధికారులు, ఆలయ కమిటీ తీరు, స్థానికుల అధికార దుర్వినియోగంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా శని, ఆది, సోమ, పర్వదినాలు, కార్తీకపౌర్ణమి సమయాల్లో కీసరగుట్ట రామలింగేశ్వరాలయానికి వచ్చే భక్తులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. బుధవారం నుంచి ప్రారంభం కానున్న కార్తీక మాస పూజల నుంచైనా భక్తులకు సౌకర్యాల కల్పనపై దృష్టి సారిస్తారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పోలీసుల పెత్తనం

నెల రోజులు కీసరగుట్టలో జరిగే కార్తీక మాసోత్సవాల్లో పోలీసులు పెత్తనం చేస్తారు. కీసర పోలీస్ స్టేషన్ ఉన్నా పెత్తనం మాత్రం ఇతర ప్రాంతాల అధికారులదే. పోలీసు శాఖ అధికారులకు ఇక్కడ దర్శనం రాచమార్గం ద్వారా కల్పిస్తున్నారు. వాహనం గుట్ట వద్దకు రావడం మొదలు స్వామి వారి సన్నిధి చేరే వరకు వారిని అడ్డుకునే వారుండరు. దర్శనానికి అపసవ్య దిశగా(ఎగ్జిట్) నుంచి వెళ్లి దర్శించుకోవడంతో అభిషేక టికెట్లు కొన్న భక్తులు గంటల తరబడి వేచి ఉంటున్నారు. పైగా వీఐపీగా వచ్చే వారికి ఏ ఒక్క చార్జీ ఉండదు. అన్నీ పుణ్యానికే. డబ్బులు వెచ్చించే భక్తులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇలా నెల రోజులు పోలీసు శాఖ వారు ఎంతమందొస్తారో లెక్క తీస్తే ఆ మేరకు ఆలయ ఆదాయం ఎంతగా పోతుందో అంచనా వేయొచ్చు. అలాగే తమ దర్పాన్ని చూపించుకునేందుకు కూడా కొందరు ఆలయానికి వస్తారనే విమర్శలు వస్తున్నాయి. దర్శన, సేవా టికెట్లు కొనకుండా ఫౌండర్ సభ్యులను పట్టుకొని, ట్రస్ట్ బోర్డు మెంబర్ల పేరు చెప్పి, ప్రజాప్రతినిధులమనో.. నాయకులమనో.. మేం లోకల్.. మాకు ఇజ్జత్ ఇవ్వరా? అని బెదిరిస్తూ స్వామివారి సన్నిధి చేరుకునే వారు వందల్లో ఉంటారు. వీరికి ప్రసాదంతో పాటు అన్నీ ఫ్రీనే. టికెట్లు కొన్న భక్తులకేమో ఆలస్యం తప్పదు. దీంతో వారికి బేజారొచ్చి గొడవకు దిగిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

అధికార దుర్వినియోగం

వివిధ శాఖల అధికారులు కూడా స్వామి వారి వద్ద అధికార దుర్వినియోగానికి పాల్పడుతారు. రెవెన్యూ, విద్యుత్, కలెక్టరేట్ ఇలా వివిధ శాఖల అధికారులు నేరుగా దర్శనానికి వెళ్తుంటారు. ఎండోమెంట్ ఉద్యోగులు ఇలా పలు విభాగాల వారు దర్శనానికి నానా రభస చేస్తారు. నిజానికి నెల మొత్తంలో అభిషేకాలకు ఎన్ని టికెట్లు విక్రయిస్తారో.. అంతకంటే రెట్టింపు సంఖ్యలో ఉచిత అభిషేకాలు, అర్చనలు చేయిస్తుండడం గమనార్హం.. అలాగే ప్రసాదాలు, ఆశీర్వచనాల శాలువాలు ఇలా ఆలయ ఆదాయానికి భారీ గండి పడుతుంది. కొన్నేళ్లుగా ఫ్రీ అభిషేకాలతో గుట్ట ఆదాయం భారీగా తగ్గిపోయింది. అసలే శైవాలయాలకు ఆదాయం తక్కువ. కీలక సమయాల్లో ఇలా ఫ్రీగా వదిలేస్తుండడంతో ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు.



స్వామివారి దర్శనానికి లైన్లో భక్తులు(ఫైల్)

తీరు మారితేనే...

కార్తీకంలో ఫౌండర్, ట్రస్ట్ బోర్డు సభ్యుల తీరు మారాలి. వారు కూడా స్వామివారి సేవలో పాల్గొనాలి. ఇష్టానుసారం అభిషేకాలు, అర్చనలు చేసుకోకుండా ఉదయమే పూజలు ముగించుకొని భక్తులకు ఇబ్బంది కలగకుండా వ్యవహరించాలి. ఆలయంలో పెత్తనం చేయకుండా, అభివృద్ధికి పాటుపడాలి. కాగా కీసరగుట్ట ఆలయంలో ఎండోమెంట్ శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఈవోకు ఇతర ఆలయాల ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడంతో ఇక్కడ విధుల నిర్వహణ సరిగా లేదు. కీసరగుట్ట కార్తీకంలో అభిషేకాలకు పెట్టింది పేరు. అలాంటి సమయంలో అధికారులు ఫ్రీగా అభిషేకాలు చేయించుకొని, ప్రసాదాలు తీసుకొని వెళ్తుంటే ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎప్పుడో ఏసీ రేంజ్‌కు వెళ్లాల్సిన కీసరగుట్ట ఆలయం అభివృద్ధి అంతంతే. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్నా అధికారులు నిర్లక్ష్యంతో కీసరగుట్ట ఆలయం అభివృద్ధి చెందడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సారైనా భక్తులకు ఇబ్బందులు తప్పేలా అధికారులు, కమిటీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కార్తీకం.. శుభకరం

నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం



నందివనపర్తిలో కొలువైన నందీశ్వరుడు

యాచారం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నేటి నుంచి ప్రారంభం కానుండడంతో జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. ఈనెల 22 నుంచి నవంబరు 21 వరకు కార్తీక మాసం కొనసాగుతుంది. వేడుకలకు శివాలయాలను నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. భక్తులు శివాలయాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. అందుకు తగ్గట్లు ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాత్రి వేళ భక్తులు ఆలయాల వద్ద ఇళ్లల్లో భజనలు చేసి శివపార్వతులు, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేస్తారు. కార్తీక మాసం సందర్భంగా మాలలు ధరించడానికి భక్తులు సిద్ధమవుతున్నారు. ఈ మాసంలో శివునకు పూజలు చేస్తే పాప విముక్తులవుతారిని భక్తుల నమ్మకం.

ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

యాచారం మండలంలోని నందివనపర్తిలోని నందీశ్వరాలయం, సిద్దేశ్వరాలయం, శ్రీఓంకారేశ్వరాలయం, నల్లవెల్లిలోని గుట్టపై రామలింగేశ్వరస్వామి ఆలయం, గున్‌గల్ శివాలయంలో, తక్కళ్లపల్లిలోని గుట్టపై వెలిసిన మరకత శివునకు, శ్రీజ్ఞానసరస్వతీ ఆలయాల్లో భక్తులు రాత్రివేళ దీపాలంకరణ చేయడంతోపాటు భజనలు, కోలాటలు ఆడుతారు. చాలా మంది భక్తులు ఈ మాసంలో ప్రతి సోమవారం ఉపవాస దీక్ష చేపడతారు. నోములు, వ్రతాలు ఆచరిస్తారు. కార్తీక మాసంలో ఒక్కోరోజు ఒక్కో విశేషం ఉంటుంది. ఈ నెల మొత్తం పర్వదినాలే. తక్కళ్లపల్లి గుట్టపై వెలసిన మరకత శివుడికి అభిషేకాదులతోపాటు భక్తులకు నెల రోజుల పాటు అన్నదానం చేస్తారు.

ఈతకు వెళ్లి పదో తరగతి విద్యార్థి మృతి

మహేశ్వరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లిన పదో తరగతి విద్యార్థి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మహేశ్వరం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. రాజేంద్రనగర్ ఇంద్రారెడ్డి కాలనీకి చెందిన అంకిత్(16) మహేశ్వరంలోని జేజే ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న రాజేంద్రనగర్ బీసీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం అంకిత్ మరో ఇద్దరు స్నేహితులతో కలిసి గురుకుల పాఠశాలకు సమీపంలో ఉన్న కొత్వాల్ చెరువులో స్నానం చేయడానికి వెళ్లాడు. ముందుగా చెరువులోకి దిగిన అంకిత్‌కు ఈత రాకపోవడంతో చెరువులో మునిగి పోవడంతో తోటి విద్యార్థులు వెంటనే హాస్టల్‌కు వెళ్లి సిబ్బందికి, తోటి విద్యార్థులకు చెప్పారు. సిబ్బంది వెంటనే మహేశ్వరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ వెంకటేశ్వర్లు చెరువు వద్దకు వెళ్లి బాలుడి ఆచూకీ కోసం చెరువును గాలించగా ఆదివారం అర్ధరాత్రి అంకిత్ మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. దీపావళి రోజే కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తమ కుమారుని మృతికి తోటి విద్యార్థులు, సంబందిత హాస్టల్ సిబ్బందే కారణమని, వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలన్నారు. సంబందిత ఉన్నతాధికారులు విచారణ చేపట్టి పాఠశాల ప్రిన్సిపాల్‌పై తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నియకులు డిమాండ్ చేశారు.

సంపులో పడి చిన్నారి..



రక్షిత మృతదేహం

షాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సంపులో పడి 18 నెలల చిన్నారి మృతి చెందిన ఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని బోడంపహాడ్ గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల మల్లేష్, స్వాతి దంపతులు. స్వాతి తన తల్లి సుగుణమ్మకు కూతురిని అప్పగించి గ్రామంలోనే కూలికి వెళ్లింది. అయితే ఇంటి పక్కన సుగుణమ్మ ఇల్లు కట్టుకుంటుండగా నీటి సంపును నిర్మించుకున్నారు. రక్షిత ఆడుకుంటూ వెళ్లి సంపులో పడిపోయింది. ఆదే గ్రామానికి చెందిన సత్తయ్య గమనించి రక్షితను సంపులో నుంచి బయటకు తీయగా అప్పటికే పాప మృతి చెందింది. నీటి సంపుపై కప్పును ఏర్పాటు చేయని సుగుణమ్మపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మల్లేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు లోబడి లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో మాదురి అన్నారు. నిర్మాణాలను బట్టి ప్రభుత్వం బిల్లులు అందిస్తుందని పేర్కొన్నారు. ఆమనగల్లు మండలం సీతారామ్‌నగర్ తండా, కోనాపూర్ గ్రామాల్లో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హా ఈ పథకంలో భాగంగా ప్రతి ప్రభుత్వ సంస్థకి, ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, స్ట్రక్చర్ బోర్‌వెల్, రీచార్జ్ స్ట్రక్చర్స్, మ్యాజిక్స్ ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్, వినద్, ఫీల్డ్ అసిస్టెంట్లు జైపాల్, ఈదమయ్య, తదితరులు ఉన్నారు.

కరాటే పోటీల్లో కొందుర్గు నహీద్ ప్రతిభ

కొందుర్గు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని చంద్రా గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన 22వ జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీలలో కొందుర్గు మండల కేంద్రానికి చెందిన నహీద్ అండర్ 14 ఇయర్ అమ్మాయిల విభాగంలో తలబడి బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా సన్మానించి ప్రశంస పత్రం, మెమొంటోను అందజేశారు. బంగారు పతకం సాధించిన నహీద్, కరాటే మాస్టర్ రమేష్‌ను అభినందించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీల అమలుపై గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలన్నారు. మంగళవారం ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో జైపాల్ యాదవ్ పర్యటించారు. పలు చోట్ల దీపావళి నోముల్లో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు జైపాల్ యాదవ్‌కు స్వీట్లు అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జైపాల్ యాదవ్ మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు పరిచి కాంగ్రెస్ బీసీల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు పూర్వవైభవం మొదలైందని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గంప వెంకటేశ్, లక్ష్మీనర్సింహారెడ్డి, పత్యనాయక్, శ్రీనివాస్‌యాదవ్, నిరంజన్‌గౌడ్, సయ్యద్ ఖలీల్, గోపాల్, లచ్చిరామ్‌నాయక్, జోగు వీరయ్య, సైదులు గౌడ్, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి అయ్యప్ప ఆలయంలో అన్నదానం

శంకర్‌పల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం నుంచి అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శంకర్‌పల్లి అయ్యప్ప సేవాసమితి సభ్యులు తెలిపారు. కార్తీకమాస ప్రారంభం రోజు నుంచి డిసెంబరు 26 వరకు 66 రోజుల పాటు అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. రోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు అయ్యప్పస్వాములకు అన్నప్రసాదం అందుబాటులో ఉంటుందని తెలిపారు. అన్నప్రసాదం చేయాలనుకున్న వారు రూ.31,000 అందించాలని అయ్యప్ప సేవా సమితి వారు కోరారు. మరిన్ని వివరాలకు ఆలయ కమిటీని సంప్రదించాలని సూచించారు.

ఆర్టీఐ మండల కార్యదర్శిగా చంద్రశేఖర్

కందుకూరు, అక్టోబరు 21(ఆద్రజ్యోతి): మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన మద్దెల చంద్రశేఖర్‌ను సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ మండల ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు చట్టం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఫయాజ్ తెలిపారు. మంగళవారం కందుకూరు గ్రామంలో ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాచార హక్కు చట్టంను మరింత బలోపేతం చేస్తూ.. ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

పోలీస్ సిబ్బందికి హెల్మెట్ల పంపిణీ

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): దీపావళి పండగను పురస్కరించుకొని పోలీసు సిబ్బందికి మంగళవారం మల్కాజ్‌గిరి ఏసీపీ ఎస్.చక్రపాణి హెల్మెట్లు పంపిణీ చేశారు. విధుల్లో బైక్‌పై వెళ్తతున్న పోలీసులు ఇద్దరికీ హెల్మెట్లు ఉండాలనే హెల్మెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ రాజువర్మ, ఎస్సైలు నాగేశ్వర్‌రావు, శివకృష్ణ, కృష్ణయ్య, రాజు, విజయభాస్కర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్‌కు రూ.8,110

యాచారం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులు పత్తిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రవినాథ్ కోరారు. పత్తి ఏ గ్రేడ్ రకానికి క్వింటల్ రూ.8,110, బీ గ్రేడ్‌కు రూ.8,028.90, సీ గ్రేడ్ రూ.7,947.80 మద్దతు ధర కల్పించినట్లు తెలిపారు. కపాస్‌కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసి అందులో తెలిసిన వివరాల ప్రకారం విక్రయించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫిర్యాదులకు 8897281111లో సంప్రదించాలని, అలాగే టోల్ ఫ్రీనంబర్ 180025995779ను సంప్రదించవచ్చని తెలిపారు.

ఆనందోత్సాహాలతో దీపావళి


దౌల్తాబాద్: దేవరఫస్లాబాద్‌లో ఓ ఇంట్లో లక్ష్మీపూజ


తాండూరు: తన కుటుంబ సభ్యులతో దీపావళి వేడుక నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి


నవాబుపేట్‌లో టపాసులు కాల్చుతున్న యువతి, చిన్నారి

మేడ్చల్, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సోమవారం దీపావళి పర్వదినాన్ని ప్రజలు ఆనందోత్సాహాల మధ్య భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణాలు, పల్లెల్లో దీపావళి సందడి నెల కొంది. దుకాణాల వద్ద, ఇళ్లలో లక్ష్మీ పూజలు చేశారు. అనంతరం ప్రజలు టపాసులు కాలుస్తూ ఆనందంగా గడిపారు.

కీసర రూరల్: నాగారం, దమ్మాయిగూడ మునిసిపాలిటీల్లో ప్రజలు దీపావళి పర్వదినాన్ని జరుపుకున్నారు. స్థానిక ఆలయాల్లో రద్దీ నెలకొంది. స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్లలో విద్యుత్ దీపాలతో బొమ్మల కొలువును ఏర్పాటు చేసుకున్నారు. లక్ష్మీదేవిని పూజించారు. దుకాణాలను మామిడి తోరణాలు, పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. పూలు, గుమ్మడికాయలకు డిమాండ్ పెరిగింది. ప్రధాన రోడ్డులో టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేశారు. కీసర లో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన దుకాణాన్ని ఎస్వోటీ పోలీసులు సీజ్ చేశారు.

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మూడో వార్డు మాజీ కౌన్సిలర్ బొక్క సంగీతప్రభాకర్‌రెడ్డి దంపతులు బొక్కోనిగూడ చౌరస్తాలోని తమ కార్యాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వార్డు ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. స్థానికులకు వారు మిఠాయిలు పంపిణీ చేశారు.

నవాబుపేట: దీపావళి పర్వదినాన్ని మండల వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్న, పెద్ద తేడాలేకుండా టపాసులు పేల్చారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో దీపావళిని ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే వాహనాలకు, వ్యక్తిగత కార్యాలయాలకు పూజలు నిర్వహించారు. ఎదులాబాద్‌లోని గోదా సమేత శ్రీ మన్నారు రంగనాయకస్వామి ఆలయంలో ఊంజల్ సేవ నిర్వహించారు. అమ్మవారికి, స్వామివారికి పూజలు నిర్వహించారు. ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్: దౌల్తాబాద్ ఇళ్లు, వ్యాపార సముదాయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి లక్ష్మీపూజలు నిర్వహించారు. సాయంత్రం చిన్నారులు, యువకులు టపాసులు కాల్చుతూ వేడుకలో పాల్గొన్నారు.


ఎదులాబాద్ రంగనాయకస్వామి ఆలయంలో ఊంజల్ సేవ

తాండూరు: వ్యాపార, వాణిజ్య కేంద్రమైన తాండేరు పట్టణంలో దీపావళి పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు.వివిధ దుకాణాలు, పాలిసింగ్ పరిశ్రమలు, కార్మాగారాల్లో లక్ష్మీ పూజలు నిర్వహించారు.తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన కుటంబసభ్యులతో కలిసి దీపావళి పండుగను జరుపుకున్నారు.


బొక్కోనిగూడలోని కార్యాలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ కౌన్సిలర్ సంగీత-ప్రభాకర్ రెడ్డి దంపతులు

రోడ్డు పక్కనే గుట్టలుగుట్టలుగా..


రోడ్డు పక్కన ట్రాఫిక్ పోలీసులు పేర్చిన రాళ్లు

(ఐదో పేజీ తరువాయి)

గండి మైసమ్మ రోడ్డు పక్కన ఇష్టారీతిన డంప్ చేస్తున్నారు. ఈ తంతు ఏడాది కాలంగా కొనసాగుతునప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోని పరిస్థితి. మున్సిపల్ పరిధిలో వ్యర్థాలు, ఇతర హానికర వస్తువులు ఎక్కడ బడితే అక్కడ డంప్ చేయరాదని మున్సిపల్ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తునప్పటికీ ఆయా వ్యాపారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు పై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు రాత్రివేళల్లో అదుపు తప్పి బండరాళ్లను ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలాంటి ఘటనలు పదుల సంఖ్యలో జరగుతున్నా పట్టించుకనే నాథుడు కరువయ్యాడు. ఈ విషయాన్ని పలువురు స్థానికులు అధికారులు దృష్టికి తీసుకు పోయినప్పటికీ పట్టించుకో లేదని తెలిసింది.

వరుస క్రమంలో బండరాళ్లు

పెద్ద బండరాళ్లను చెక్‌పోస్టు సమీపంలోని గోయల్ పెట్రోలు బంక్ వెనుక భాగాన ఉన్న గండి మైసమ్మ రోడ్డు ఒక వైపు వరస క్రమంలో పేర్చుతున్నారు. పేర్చిన రాళ్లకు సున్నం వేసి రాత్రి వేళ వాహన దారులు వాటిని ఢీకొనకుండా రేడియం స్టిక్కర్లను అంటిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ పోలీసులే బండరాళ్ల డంపింగ్ చేస్తున్న వారిని ప్రోత్సహిస్తునట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. రోడ్డు పక్కన కొందరు తమ వాహనాలను పార్కింగ్ చేస్తున్నందున రాళ్లను ఏర్పాటు చేసి వాటికి సున్నం వేసి రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. రోడ్డు పక్కన విచ్చలవిడిగా నిలబడే వాహనాలను అనధికారికంగా పార్కింగ్ చేసిన వాహదారులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడతున్నారు. ఈ సమస్యకు చెక్ పెట్టడానికి గతంలో ట్రాఫిక్ పోలీసులు రోడ్డు పక్కన పెద్ద బండ రాళ్ల ఏర్పాటు చేశారని స్థానికులు కొందరు తెలిపారు. కాగా, ప్రతీ రోజు తమ పిల్లలు ద్విచక్ర వాహనాలపై కళాశాలలకు వెళ్తుంటారని, డివైడర్ లేకుండా ఉన్న సింగిల్ రోడ్డు పక్కన పెద్ద పాటి బండాళ్లను ఏర్పాటు చేయడం ఊహించని పరిణామాలకు దారి తీస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా ఏర్పాటు చేసిన బండరాళ్లను తొలగించడంతో పాటు రాళ్ల డంపింగ్‌ను అధికారులు డ్డుకుని ప్రజల ప్రాణాలు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.


బండ రాళ్లను డంప్ చేస్తున్న ట్రాక్టర్

ధాన్యం కొనుగోళ్లకు కసరత్తు

(ఐదో పేజీ తరువాయి)

చర్యలు చేపట్టారు. అకాల వర్షం కురిసినా ధాన్యం తడవకుండా ఉండేందుకు 4వేల టార్పాలిన్ షీట్లను అధికారులు, నిర్వాహకులు సిద్ధంగా ఉంచారు.

రావులపల్లి, కొత్లపూర్‌లో చెక్ పోస్టులు

సన్నరకం వరి సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ దాన్యం సేకరించేందుకు జిల్లాలో 20 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. సన్నరకం వరి సాగవుతున్న ప్రాంతాల్లోనే ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే, ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు రావులపల్లి, కొత్లాపూర్‌లలో చెక్ పోస్టులను ఏర్పాటు చేయనున్నారు.

బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడుదాం


విలేకరులతో మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

దౌల్తాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):బీసీ రిజర్వేషన్‌ల సాధనే లక్ష్యంగా పోరాడుదామని బీసీ సంఘం సీనియర్ నాయకుడు బల్ల యాదగిరి పటేల్ పిలుపునిచ్చారు. సోమవారం దౌల్తాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కుల గణన చేసి అసెంబ్లీలో అన్ని పార్టీల ఏకాభిప్రాయంతో తీర్మానం చేసి బిల్లును రాష్ట్ర గవర్నర్‌కు పంపితే ఆమోదించడం కాని, తిరస్కరించడం చేయలేదన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం తమిళనాడులో రిజర్వేషన్‌లు ఇచ్చినట్టే తెలంగాణలోనూ ఇవ్వాలనే ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను జారీ చేసిందన్నారు. బీసీ ప్రధానిగా చెప్పుకునే నరేంద్రమోడీ బీసీలకు రిజర్వేషన్‌లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే కొందరు అగ్రవర్ణాల వారు కోర్టుల్లో కేసు వేయడం దుర్మార్గం అన్నారు. ఇప్పటికైనా బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మన్నె బస్వరాజ్, నాయకులు మల్కయ్యగౌడ్, కృష్ణ, బాల్‌రాజ్, శ్యామప్ప, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

నిరంజన మఠం ఆలయాన్ని సందర్శించిన కడా ప్రత్యేకాధికారి

కొడంగల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి మంగళవారం కొడంగల్ పట్టణంలోని నిరంజన మఠాన్ని సందర్శించారు. మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నందారం ప్రశాంత్ సమక్షంలో ఆలయ అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు కడా ప్రత్యేకాధికారిని శాలువాతో సన్మానించారు.


కడా అధికారిని సన్మానించిన ఆలయ నిర్వాహకులు

అల్పాహారంలో సెట్ దోశ అందజేత


కొడంగల్‌లో జడ్పీ బాలికల పాఠశాలలో అల్పాహారంలో సెట్ దోశను అందిస్తున్న ఎంఈవో రాంరెడ్డి

కొడంగల్ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గంలోని 8 మండలాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్(హెచ్‌కేఎం) ద్వారా అందిస్తున్న అల్పాహార పథకంలో భాగంగా మంగళవారం సెట్ దోశలను విద్యార్థులకు అందించినట్లు ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. కొడంగల్‌లోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలోని 700 మంది విద్యార్థినులకు అల్పాహారంలో సెట్ దోశలను అందించారు. 8 మండలాలలోని పాఠశాలల విద్యార్థులందరికీ నాణ్యమైన రుచికరమైన దోశలను అందిస్తామని హెచ్‌కేఎం డిప్యూటీ మేనేజర్ కృష్ణచైతన్య ఈ సందర్భంగా తెలిపారు. ఇడ్లీ, మిల్లెట్ ఇడ్లీ, ఉప్మా, పొంగలి, బోండా, పూరిలతో పాటుగా సెట్ దోశలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో రాంరెడ్డి మాట్లాడుతూ.. అన్నం పరబ్రహ్మ స్వరూపం అని, కావున పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అల్పాహారాన్ని అందిస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సంస్థకు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల, గురుకులాలను కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలి

కొడంగల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌కు మంజూరైన మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలించకుండా కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలని కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్ కోట్రికె లక్ష్మీనారాయణగుప్తా, జి.సురేశ్‌కుమార్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, రమేశ్ బాబులు అన్నారు. విద్యాసంస్థల తరలింపునకు నిరసనగా మంగళవారం కొడంగల్ పట్టణంలోని వినాయక చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు నోటికి నల్ల రిబ్బన్‌లు కట్టుకొని నిరసన ర్యాలీ నిర్వహించారు. విద్యాసంస్థలను ఇతర ప్రాంతాలకు తరలించడంతో ఈ ప్రాంతానికి అన్యాయం జరుగుతుందని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నవాజ్, ఎస్ఎం.గౌసన్, పవన్, రమేశ్‌బాబు, భీమరాజు, సూర్యనాయక్, శ్రీనివాస్, పకీరప్ప, శివకుమార్, దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.


కొడంగల్‌లో నోటికి రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

క్రీడలతో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి


క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న రాములునాయక్

పూడూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని పీఏసీఎస్ డైరెక్టర్ రాములునాయక్ అన్నారు. దీపావళి సందర్భంగా తిర్మలాపూర్‌లో రాములునాయక్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. నాలుగు జట్లు పాల్గొనగా విజేతకు కప్‌తో పాటు 10వేలు నగదును రాములునాయక్ అందించారు. గ్రామీణ యువకులను ప్రోత్సహిస్తే వారిలోని నైపుణ్యం బయటపడుతుందన్నారు. అనంతరం రన్నర్స్‌కు గ్రామస్తుడు పరశురాం రూ.5వేలు అందించారు. క్రీడాకారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

97 ఏళ్ల వృద్ధుడికి విజయవంతంగా టీయూఆర్పీ ఆపరేషన్

మేడ్చల్ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):మూత్రాశయంలో తలెత్తే ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న ఓ 97ఏళ్ల వృద్ధుడికి మెడిసిటీ ఆస్పత్రి వారు టీయూఆర్పీ శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. 97ఏళ్ల వ్యక్తికి ఈ శస్త్ర చికిత్స చేయడం అరుదని వైద్యులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో డాక్టర్ బెనర్జీ, డాక్టర్ గోపాలకృష్ణలతో పాటు మెడిసిటీ ఆసుపత్రి వైద్య బృందం పాల్గొంది. విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యబృందానికి ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.


టీయూఆర్‌పీ శస్త్ర చికిత్స అనంతరం డాక్టర్లతో వృద్ధుడు

బీసీ-ఈలకు 12 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

బొంరాస్‌పేట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తూ అదే రిజర్వేషన్లలో బీసీ-ఈలకు 12శాతం కేటగిరీ వారీగా కేటాయించాలని మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ వసీమ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీసీ-ఈ వర్గానికి 12శాతం రిజర్వేషన్ల అమలుకు ఉన్న రాజ్యాంగ ప్రమాణాలు, సచార్ కమిషన్ నివేదిక ఆధారంగా న్యాయ పోరాటం ముదురుతోందన్నారు. మాకు మా హక్కు కావాలి, రాజ్యాంగం ప్రకారం న్యాయం జరగాలి అనే నినాదంతో ఉద్యమాన్ని తెలంగాణ నుంచి దేశ వ్యాప్తంగా విస్తరించేందుకు మైనారిటీ హక్కుల పోరాట సమితి కృషి చేస్తుందన్నారు. ఉద్యమం సామాజిక న్యాయ ఉద్యమంగా, రాజ్యాంగ బద్ధ హక్కుల కోసం జరుగుతున్న పోరాటంగా నిలుస్తుందన్నారు. సచార్ నివేదిక, రాజ్యాంగం, ముస్లింల ప్రస్తుత పరిస్థితి ఈ మూడు అంశాల ప్రాతిపదికన బీసీ-ఈలకు 12శాతం రిజర్వేషన్ల అమలు పూర్తిగా న్యాయ సమ్మతం అన్నారు.


మహ్మద్ వసీం, మైనారిటీ సంఘం నాయకుడు

క్రైం కార్నర్

మినీ బస్సు ఢీకొని అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి

● మరో ఇద్దరికి గాయాలు.. పండుగకు వెళ్లి వస్తుండగా ఘటన


మాలోత్ శ్రీనివాస్(ఫైల్)

మేడ్చల్ టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సొంతూరులో దీపావళి పండుగ జరుపుకుని తిరిగి వస్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతిచెందిన ఘటన మేడ్చల్ మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బంజెపల్లికి చెందిన మాలోత్ శ్రీనివాస్ (35) మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో సీఎస్ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ కొంపల్లిలో ఉంటున్నాడు. దీపావళి సందర్భంగా బంజేపల్లిలో తన ఇంటికి వెళ్లి మంగళవారం బైక్‌పై వస్తుండగా ఎల్లంపేట శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై మేడ్చల్ నుంచి డబిల్‌పూర్ వైపు వెళ్తున్న మినీ బస్సు అదుపు తప్పి డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న మూడు బైకులను ఢీకొంది. దీంతో శ్రీనివాస్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరు ద్విచక్ర వాహనదారులకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు చేరుకుని విచారణ జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నగరంలోని గాంధీ ఆస్పత్రికి, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

కారు ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న వెంకటయ్య

దోమ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కూలి పనులకు వెళ్తున్న ముగ్గురిని కారు ఢీకొట్టింది. ఈ సంఘటన దోమ మండలం బొంపల్లిలో సోమవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దోమ మండలంలోని బొంపల్లికి చెందిన నంద వెంకటయ్య, వెంకటయ్య, దోమ నాగయ్య బైక్‌పై పరిగికి కూలి పనుల కోసం వెళ్తున్నారు. పరిగి నుంచి కారు(టీఎస్34 హెచ్5870) వేగంగా రాంగ్ రూట్‌లో వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వెంకటయ్య, నాగయ్యలకు తీవ్ర గాయాలు, నంద వెంకటయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని కుటుంబ సభ్యులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. బైక్‌ను ఢీకొట్టిన కారు డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందక కేసు నమోదు చేయలేదని పోలీసులు చెప్పారు. కాగా ప్రమాదంపై పోలీసులకు వెంటనే సమాచారం ఇచ్చినా వెంటనే రాకపోవడంతో స్థానికులే క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు ఆలస్యంగా చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. దీనిపై ఎస్సై వసంత్‌జాదవ్‌ను వివరణిస్తూ.. సమయానికే చేరుకొని వివరాలను సేకరించామని తెలిపారు.

ఉరేసుకొని మునిసిపల్ కార్మికుడి ఆత్మహత్య

వికారాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భార్యాపిల్లలు వదిలేసి ఒంటరిగా ఉంటున్న మునిసిపల్ కాంట్రాక్టు కార్మికుడు జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకకు చెందిన సుదర్శన్ 20ఏళ్ల కింద యాలాల మండలం అచ్యుతాపూర్‌నకు చెందిన బాలమణిని వివాహం చేసుకుని వికారాబాద్‌లోని బీటీఎస్ కాలనీలో ఉంటూ కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసైన సుదర్శన్.. జీతమంతా తాగుడుకే ఖర్చు చేశాడు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. తన జీతం గురించి ప్రశ్నించిందన్న అక్కసుతో సుదర్శన్ భార్యాపిల్లలను వదిలేసి మరో గది అద్దెకు తీసుకుని ఒంటరిగా ఉంటున్నాడు. దీంతో బాలమణి ఇళ్లలో పనిచేస్తూ తన ఇద్దరు కూతుళ్లను చదివిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. సుదర్శన్ తనతో కలిసి ఉండాలని పలుమార్లు భార్యను కోరినా, ఆమె తాగుడు మానేస్తేనే వస్తానని చెప్పింది. ఇటీవల మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు దంపతులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు. అయినా మార్పు రాకపోవడంతో వేర్వేరుగానే ఉంటున్నారు. భార్యాపిల్లలు దూరంగా ఉండడంతో సుదర్శన్ మనస్తాపానికి గురై సోమవారం ఉరేసుకున్నాడు. సుదర్శన్ ఇద్దరు కూతుళ్ల ఒకరు ఇంటర్, మరొకరు పదో తరగతి చదువుతున్నారు. భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ భీంకుమార్ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి రిమాండ్


నిందితుడు అనిల్‌కుమార్

ధారూరు, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాఘవేందర్ తెలిపారు. కేసు వివరాలిలా ఉన్నాయి. అల్లాపూర్ గ్రామానికి చెందిన రుమ్మా యాదగిరి వికారాబాద్‌లో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 20న ఆయన వికారాబాద్ నుంచి అల్లాపూర్ వచ్చేసరికి ఇంటి తాళం విరగ్గొట్టి బీరువాలో ఉన్న నగదును దొంగిలించినట్లు గుర్తించాడు. అదే గ్రామానికి చెందిన అంతారం అనిల్‌కుమార్ తన ఇంట్లో దొంగతనం చేశాడని అనుమానించి యాదగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అనిల్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తానే యాదగిరి ఇంట్లో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అనిల్‌కుమార్‌పై గతంలోనూ బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం కేసులు ఉన్నట్లు ఎస్ఐ తెలిపాడు. నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

బషీరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని పట్టుకున్నారు. ఈ సంఘటన బషీరాబాద్ శివారు ప్రాంతంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నుమాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. బషీరాబాద్ శివారు ఓ పొలాంలో పేకాటాడుతుండగా దాడులు జరిపారు. పేకాటరాయుళ్ల వద్ద రూ.4,500 స్వాధీనం చేసుకొని ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



దుద్యాల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని హకీంపేట్‌కు చెందిన దోరమోని మల్లేశ్ ఇటీవల తన ఫోన్ పోయిందని దుద్యాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దర్యాప్తు చేసి ఫోన్‌ను గుర్తించారు. మంగళవారం స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ యాదయ్య ఫోన్‌ను మల్లేశ్‌కు అందించారు.